PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 200 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 16 జులై 2026

**ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**




**ఎల్‌నీనో, వర్షాభావ పరిస్థితులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన**




# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

## - గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నాం

**మా ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 9 టీఎంసిల నీటికి యత్నం**

**దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్రారంభించిన సిఎం రేవంత్**






**మహబూబ్‌నగర్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నామని, అందులో మంచివుంటే మరింత మెరుగ్గా ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వానికి పాలసీపెరాలసిస్ లేదని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీలను మరింత మెరుగుపర్చి ముందుకు తీసుకెళ్తున్నాం అని అన్నారు. 1994 నుంచి 2004వరకు చంద్రబాబునాయుడు, 2004 నుంచి 2014వరకు వైస్ రాజశేఖర్ రెడ్డి, 2014 నుంచి 2023డిసెంబర్ వరకుగత ప్రభుత్వాలు తీసుకువచ్చిన పాలసీలను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతప్రభుత్వాల మిగతా2లో...




# 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు మిగతా2లో...

# కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

## - సిసి రోడ్డు పనులకు బండి శంకుస్థాపన



**కరీంనగర్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ మిగతా2లో...

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం


- ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై మండిపాటు
- పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా
- రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి
- సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి
- ఢిల్లీలో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్




**న్యూఢిల్లీ,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు మిగతా2లో...

# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

## - బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి



**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని మిగతా2లో...



# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన

**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్స్ ÷నైల్ అని స్పష్టం చేశారు. మిగతా2లో...

# తెలంగాణలో సర్ నమోదు పక్రియ

## గడువును అగస్ట్ 3 వరకు పొడిగించిన ఎన్నికల సంఘం



**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో సర్ నమోదు పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించింది. సెప్టెంబర్ 9 వరకు మిగతా2లో...

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

## - కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పొంగులేటి

**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకోకుండా ఫాంహౌస్‌కే ఆయన మిగతా2లో...



# చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ



PCW తెలుగు దినపత్రిక



# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పాలసీల్లో ఉన్న మంచి మేం కూడా ప్రోత్సహిస్తున్నాం.. మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ లు డీకే అరుణ,మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరరాజా అద్భుతమైన పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసిందని, 1983 లో అమరరాజా చిత్తూరు జిల్లాలో మొదటిసంస్థను ఏర్పాటు చేసిందన్నారు. అమర రాజా సంస్థ ఏర్పాటు చేసి 40 యేళ్లు అవుతోందన్నారు. అమర రాజా గ్లోబల్ సంస్థ.. అంటూ అమర రాజా కు దేశంలో పోటీ లేదన్నారు. చైనా, జపాన్, జర్మని, కొరియా లాంటి దేశాలనుఆదర్శంగా తీసుకుని అమర రాజా సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో చైనా ఈవీవెహికిల్స్ కు లీడర్ గా ఉంది.. ఈవీ లో చైనాతో అమర రాజా సంస్థ పోటీ పడిపనిచేస్తోంది.. కాలుష్యం వేగంగా విస్తరిస్తోంది.. వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయి.. ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు పడటం లేదు.. రైతులు ఇబ్బంది పడుతున్నారు.. కోవిడ్ తర్వాత వాతావరణంలోచాలా మార్పులు వచ్చాయని సిఎం అన్నారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.. కాలుష్య నియంత్రలోఈవీవెహికిల్స్అవసరం ఉంది.. దివిటిపల్లి అమర రాజా యూనిట్ లో 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు..ఇందులో 400 మంది మహిళా ఉద్యోగులు ఉండటంమహిళా సాధికారిత కు నిదర్శనం.. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా పాలసీలుతీసుకువస్తున్నాం.. ప్రస్తుతం దేశ జీడీపీలో5 శాతం తెలంగాణ వాటా గా ఉంది.. కాని నేను దీనిపైన సంతోషంగా లేను..

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం.. 2034 నాటికి తెలంగాణను వన్ట్రిలియన్డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా ధ్యేయం అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్ కు మద్దతుగా ఉంటున్నాయి.. తెలంగాణనుక్యూర్, ప్యూర్, రేర్ గా విభజించిపాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం.. తెలంగాణ పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు ముఖ్యం.. పారదర్శకంగా విధానాలు రూపొందించుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.. ఢిల్లీకి రాజు అయినా తల్లికి బిడ్డ అన్నట్లు గా నేను పాలమూరుబిడ్డను. ఆదర్శవంతంగా జిల్లా గా మహబూబ్నగర్ ను తీర్చిదిద్దుతున్నాం.. ఒకప్పుడుకరువు జిల్లాగా ఉండే మహబూబ్నగర్ ఇప్పుడు ఇతరజిల్లాలనుదత్తత తీసుకునే స్థాయికి ఎదిగాం.. విద్య లో భాగంగా ట్రిబుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు,ఏటీసీసెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ జిల్లాలో ఏర్పాటు చేశాం.. బ్లూ కాలర్ జాబ్ ల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ లు ఏర్పాటు చేస్తున్నాం.. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, బీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.. త్వరలోనే మహబూబ్‌గర్ జిల్లా ప్రజలకుశుభవార్త వినిపిస్తున్నాం. పక్క రాష్ట్రంతో సంప్రదింపులుజరుగుతున్నాయి.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీ లు సాధించే దిశగాచర్చలుజరుగుతున్నాయి.. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపుల పై చర్చలుజరుపుతున్నాం.. పరిశ్రమలకు అనుకూల వాతావరణంసృష్టించి జిల్లా లో ఉపాధి అవకాశాలుకల్పిస్తాం.. పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు అమర రాజా కు భూములు ఇచ్చారు.. అత్యధిక ఉద్యోగాలు వాళ్లకుఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బీ మినిస్టర్ గా గల్లాజయ్ దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్ లో చాలా రోడ్లు మంజూరు చేశారు.. నేను రెండో సారి గెలవడానికి నాకు అవి ఉపయోగపడ్డాయని రేవంత్ అన్నారు.

# 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం‘ అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతా మని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు దిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఎ÷-లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది. మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు. మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా? చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం. అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. సీసీఐని పునరుద్దరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్దరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# బోనాల జాతరలో హస్తకళా మేళా

## - 16 నుంచి హైదరాబాద్ హెచ్‌ఎండిఏ గ్రౌండ్‌లో ప్రదర్శన



**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈనెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ,వాకిటి శ్రీహరి , బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి.హెచ్. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత , పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని కోరారు.

# కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో యూడీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ మంకమ్మతోటలో రూ. 98లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా భాజపా పని చేస్తోందన్నారు. కరీంనగర్ నగరాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని.. మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

# తెలంగాణలో సర్ నమోదు పక్రియ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాల స్వీకరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించింది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది. అనేక జిల్లాలో సర్‌పై అవగాహన లేక మందకోడిగా కొనసాగుతుండగా గడువు సమీపిస్తుండడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి దీంతో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగింపును ప్రకటించింది. అర్హత తేదీగా అక్టోబర్ 1వ తేదీ నాటికి ఓటర్ల వివరాల సవరణను పరిగణనలోకి తీసుకుంటూ నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే పక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను సైతం అధికారులు ఆగస్టు 3 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన అనంతరం, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు , తప్పుల మార్పులు-చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార పక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ పక్రియ అంతా ముగిసిన తర్వాత అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానిక గా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

(మొదటి పేజీ తరువాయి)


పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

# చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ

**హైదరాబాద్ ,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** బలహీనపడిన నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజుకోనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో మార్పుల వల్ల సముద్రపు గాలులు బలంగా వీస్తూ దట్టమైన మేఘాలు అలుముకోనున్నాయని పేర్కొంది. రెండు, మూడు రోజుల్లో ఇది అల్పపీడనంగా మారి ఒడిశా, బెంగాల్ తీరాల వైపు పయనించి, తూర్పు భారతదేశంలో వర్షాలు కురిపించనుందని వెల్లడించింది. జులై 19 వరకు తెలంగాణలోని ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, గురువారం జోరందుకుంటాయని అంచనా వేసింది.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

**● కేంద్రంతో నిరంతర సంప్రదింపులు ● ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాల తరలింపు ● ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల చర్చ**



**హైదరాబాద్,జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యా చరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటం తో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ఈ న్యాయ పరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు.

## ఎల్‌నీనో, వర్షాభావ పరిస్థితులు ప్రత్యామ్నాయ

# పంటలపై రైతులకు అవగాహన

**వెల్లంపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి అహ్మద్ రజా**

**పరకాల, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అహ్మద్ రజా ఆధ్వర్యంలో రైతులకు ఎల్ నీనో వాతావరణ పరిస్థితులు, వర్షాభావ ప్రభావం మరియు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ అహ్మద్ రజా మాట్లాడుతూ, ఎల్ నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని



సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల నిర్వహణ చేపట్టడంతో పాటు తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటలైన కందులు, పెసర, మినుములు తదితర పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక దిగుబడులు వచ్చే పంటలను ఎంచుకోవడం ద్వారా ఆర్థిక నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ విధానాలను అనుసరించి పంటల సాగు చేయాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

## ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ

# బాధ్యతగా వ్యవహరించాలి

**ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్ పిలుపు**

**ఖమ్మం, ప్రతినిధి జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఎన్నికల యంత్రాంగం, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఓటరు ధృవీకరణ ప్రక్రియ పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 24వ తేదీతో ఓటరు మ్యాపింగ్ కార్యక్రమం ముగియనున్నందున, దానిని



ఈనెల 31 వరకు పెంచారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పార్టీకి చెందిన బీఎల్ఏలు అధికారికంగా నియమించబడిన బీఎల్ఓలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని డివిజన్ల పరిధిలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రతి అర్హ ఓటరికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు సకాలంలో పూర్తి చేసి ఎన్నికల అధికారులకు అందేలా చర్యలు తీసుకోవడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పాలడుగు కృష్ణ ప్రసాద్ అన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందేందుకు రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు పరస్పర సహకారంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని పార్టీలు, వారి బీఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని పాలడుగు కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు.

---

# ఓటు రక్షణే లక్ష్యం.. SIR2026లో ప్రతి ఓటరు సహకరించాలి

**ఎన్యూమరేషన్ ఫారాలు జూలై 31లోగా సమర్పించండి : టీడీపీ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి చుండూరీ రాజారాజేశ్వరి విజ్ఞప్తి**

**ఖమ్మం, ప్రతినిధి జూలై15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్–2026 ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి ఓటరు సహకరించాలని తెలుగు దేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి చుండూరు రాజారాజేశ్వరి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాల మేరకు ఖమ్మంతో పాటు అన్ని ప్రాంతాల్లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఖమ్మం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులు



ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారని తెలిపారు. ఇప్పటికీ ఫారాలు అందని ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ సమీపంలోని పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు లేదా సంబంధిత బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి ఫారాలు తీసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన ఫారాలను జూలై 31, 2026లోగా సంబంధిత బిఎల్ఓలకు తప్పనిసరిగా తిరిగి అందజేయాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, నిర్లక్ష్యం వల్ల ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని చుండూరీ రాజారాజేశ్వరి పిలుపునిచ్చారు. మీ ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు. ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకునేందుకు ఎస్ఐఆర్–2026 ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి అని ఆమె విజ్ఞప్తి చేశారు.

---

## ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో

# పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**కురవి జూలై15 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనుమరేషన్స్ ఫార్మ్స్ పంపిణీ చేయడం పూర్తి అయ్యిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బూతు లెవల్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించి 2002 ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరించాలని, అందు బాటులో లేని వివరాలను గుర్తించాలని, వేగంగా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగాలని ఆదేశించారు, ఇప్పటికే జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు, కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

---

# ములుగు ఎస్పీని కలిసిన రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు

**● మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి**



**మల్లంపల్లి జూలై 15(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్‌ను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో మిల్లర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎస్పీకి అందజేసి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ, 202526 రబీ సీజన్‌లో ములుగు జిల్లాలో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యాన్ని ఓపెన్ స్టోరేజ్‌లలో నిల్వ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రక్రియలో పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కూడా ధాన్యాన్ని బలవంతంగా దిగుమతి చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బియ్యాన్ని కొనుగోలు చేయకపోవడం, ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ సౌకర్యం లేకపోవడం వల్ల మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ ధాన్యం నాణ్యత తగ్గిపోవడంతో పాటు డిస్‌కలరేషన్, వెయిట్ లాస్ వంటి సమస్యలు తలెత్తి భారీ ఆర్థిక నష్టాలు వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా భవిష్యత్తులో మిల్లర్లు నష్టపోయి ప్రభుత్వానికి బకాయిలు పడే పరిస్థితి వస్తే, తమపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా చూడాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. వినతిని స్వీకరించిన ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ సానుకూలంగా స్పందించి, మిల్లర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాదం ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

---

# బాత్రూమ్‌కు వెళ్లి అదృశ్యమైన మహిళ



**ఏటూరునాగారం, జూలై 15(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన రేగ శిరీష (28) అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 12వ తేదీ సాయంత్రం బాత్రూమ్‌కు వెళ్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీష తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త రేగ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఏటూరునాగారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శిరీష ఆచూకీ తెలిసిన వారు ఏటూరునాగారం సీఐ 8712670113, ఎస్ఐ 8712670090 లేదా ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ 8712670091కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

---

# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది: మంత్రి సీతక్క

**● ప్రతి అంగన్‌వాడీని అధికారులు సందర్శించాలి.. నాసిరకం సరుకులు సరఫరా చేస్తే బ్లాక్‌లిస్ట్ ● వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం**



**హైదరాబాద్, జూలై 15(పిసిడబ్ల్యూ న్యూస్):** బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అని, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రతి జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి, సూపర్‌వైజర్ తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం సందర్శించాలని మంత్రి ఆదేశించారు. కేంద్రాల్లో అందించే భోజన నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు స్వయంగా అక్కడే భోజనం చేయాలని సూచించారు. గుడ్లు, పాలు, పప్పు తదితర పోషకాహార సరుకుల నాణ్యత విషయంలో రాజీ ఉండదని, నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు.

---

# వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్ట్

**- 18 చోరీలు చేసినట్లు ఒప్పుకున్న నిందితులు.. 312 కిలోల కాపర్ వైర్, ఆటో స్వాధీనం**



**ఏటూరునాగారం, జూలై 15(పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను ఏటూరునాగారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 312 కిలోల ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌తో పాటు దొంగతనాలకు వినియోగించిన ఆటో, కటింగ్ ప్లేయర్లు, పానాలు తదితర పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ బట్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఐటీడీఏ కార్యాలయం ఎదుట అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా భారీ మొత్తంలో కాపర్ వైర్ లభ్యమైంది. ఆటోలో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్ దొంగిలిస్తున్నట్లు అంగీకరించారు. విచారణలో నిందితులు ములుగు జిల్లాలో 14, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 చొప్పున మొత్తం 18 ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని ఏఎస్పీ తెలిపారు.

# సహకార వ్యవస్థ బలోపేతం సర్కార్ లక్ష్యం

## • సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో కవ్వంపల్లి











**బెజ్జంకి,జూలై 15(పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ బలోపేతానికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన భవనం ద్వారా రైతులకు ఒకే చోట రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం భవనంలోని కార్యాలయ గదులను పరిశీలించి, అధికారులు రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తన్నీరు శరత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, జిల్లా పార్టీ కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ తదితరులతోపాటు సహకార సంఘ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్వాన్నంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం బెజ్జంకి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట ఖజానా ఖాళీ అయ్యిందని, ఆర్థికపరమైన సమస్యలు ఉన్నప్పటకీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేందుకు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండ నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.**పాఠశాల తనిఖీ** బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంట గది శుభ్రత, వంటల్లో శుచి గురించి వంటవాళ్లను అడిగి తెలుసుకోవడమే కాకుండా తగు సూచనలు చేశారు. **సీసీ రోడ్డు పనులకు భూమిపూజ** బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు ఆయన ముత్తన్నపేట గ్రామంలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయా సీసీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయించాలని, పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. **పరామర్శ** బెజ్జంకి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జంగిటి రాజయ్య కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి ఓదార్చారు. రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## సీతారామ ప్రాజెక్టు టన్నెల్ ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

### • కలెక్టర్, సి.పి ఏర్పాట్ల పరిశీలన



**సత్తుపల్లి, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంట టన్నెల్ ప్రాంతంలో సీతారామ ప్రాజెక్టు సందర్శనకు రానున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. సమీక్షించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి హెలీప్యాడ్ ఏర్పాట్లు, టన్నెల్ నిర్మాణ పనులు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు అవసరమైన సూచనలు చేస్తూ, పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సందర్శన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## తోటి కోడలు మరిది వేధింపులతో ఆశా కార్యకర్త మృతి

### మనస్థాపంతో మాత్రలు మింగి చికిత్స పొందుతూ కన్నుమూత

### ద్వారక భాస్కరరావు పై కేసు నమోదు

**కల్లూరు, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండలం లో రఘునాథగూడెం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త జానపాటి శారద (45) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురై మాత్రలు మింగి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జానపాటి శారదకు తన తోటి కోడలు జానపాటి ద్వారక, మరిది జానపాటి భాస్కరరావుతో తలెత్తిన వివాదంలో వాగ్వాదం జరిగింది.

ఈ సందర్భంగా వారు ఆమెను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శారద పారాసెటమాల్ మాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించి మృతి చెందింది.మృతురాలి భర్త జానపాటి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జానపాటి భాస్కరరావు, జానపాటి ద్వారకాలపై ఎస్సై డి హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ లీజుపై సింగరేణిలో విజయోత్సవాలు




### సత్తుపల్లి ఏరియాలో పండుగ వాతావరణం.. కార్మికులకు మిఠాయిల పంపిణీ, డిప్యూటీ సీఎం సందేశం చదివి వినిపించిన అధికారులు





**సత్తుపల్లి, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సింగరేణి చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిన తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు మంజూరుకు సత్తుపల్లి ఏరియా పరిధిలో బుధవారం ఘన విజయోత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు లభించడంతో సింగరేణి వ్యాప్తంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.ఉదయం మార్నింగ్ షిఫ్ట్ ప్రారంభ సమయంలో జేవీఆర్ ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ డిస్పెన్సరీలలో అధికారులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవాలు నిర్వహించారు. మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జేవీఆర్ ఓసీలో ప్రాజెక్టు అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ సీహెచ్‌పీలో భూక్యా రాంబాబు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఏరియా ఇంజనీర్ సోమశేఖరరావు, కిష్టారం ఓసీలో ప్రాజెక్టు అధికారి ఎల్.ఎ.ఎస్.వి. సునీల్ వర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వో టు జీఎం బొల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు. జేవీఆర్ డిస్పెన్సరీలో డాక్టర్ బి. నరసింహారావు అధ్యక్షతన వైద్య సిబ్బంది ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో హెచ్‌వోడీలు, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రధాన విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పంపిన ప్రత్యేక సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం కార్మికులకు ఆయన సందేశంతో కూడిన కరపత్రాలు, మిఠాయిలను పంపిణీ చేశారు.తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి 45 సంవత్సరాల పాటు కొనసాగుతుందని, దీనివల్ల సింగరేణి సంస్థతో పాటు తెలంగాణ రాష్ట్ర ఇంధన భద్రతకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కోయగూడెం, సత్తుపల్లి తదితర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించేలా కృషి చేస్తామన్న ఉప ముఖ్యమంత్రి హామీపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు ప్రపంచ మిఠాయి సదస్సు ప్రారంభించనున్న సీఎం




**హైదరాబాద్, జూలై 15(పిసిడబ్ల్యూ న్యూస్ ):** తెలంగాణలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి భూతమిచ్చేలా అనేక సంస్కరణలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నమ్కిన్ మనుప్యాక్చరర్స్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన గురువారం హైదరాబాద్ హైటెక్స్ లో నిర్వహించనున్న ప్రపంచ మిఠాయి 19వ సదస్సు ప్రాంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ నక్వి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం సీఎంను ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ప్రపంచంలోని అనేక ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నారు. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎన్ఎం ప్రతినిధులు జస్మత్ పటేల్, రితీష్ జాగిర్దార్, అఫ్తాబ్ జైదీ, నీలేష్, విపుల్, ముఖేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం కండి..

**• తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం ..**
**• తిమ్మాపూర్ అభివృద్ధి కోసం బీజేపీ కార్యాచరణ • బిజెపి నేతలు రంగు భాస్కరాచారి, ఇనుగోండనాగేశ్వర్ రెడ్డి...**

**కరీంనగర్ టౌన్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ కూడా ప్రజలను వంచించే ఎజెండాతో పాలన సాగిస్తోందని, రెండు పార్టీలు ఒక్కటేనని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి ఘాటుగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తిమ్మాపూర్ మండల శాఖ అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కొత్తపల్లి లోని సాయిరాం గార్డెన్లో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రంగు భాస్కరాచారి, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి లు మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండ గట్టడానికి, పోరాటానికి సిద్ధం కావాలని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. తిమ్మాపూర్ మండల కార్యవర్గ సమావేశంలో ప్రధానంగా తిమ్మాపూర్ మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ వరకు తిమ్మాపూర్ మండల అభివృద్ధిని అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా పట్టించుకోలేదని, నియోజకవర్గం దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ రాజకీయ తీర్మానం



ప్రవేశపెట్టింది. **తిమ్మాపూర్ మండల రాజకీయ తీర్మానం.. బీజేపీ ప్రధాన డిమాండ్లు** తిమ్మాపూర్ మండలంలోనిఅన్ని గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన పంట కొనుగోలు కేంద్రాలను, అత్యాధునిక వసతులతో కూడిన మార్కెట్ యార్డును మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి. కూరగాయల సాగులో కోతుల బెడదను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, సబ్సిడీలను అందించాలి. ఎల్ఎండి పరిధిలోని ఫిలిగ్రీ ట్రైనింగ్ సెంటర్ ను వెంటనే వినియోగంలోకి తెచ్చి, కళాకారులకు ఉపాధి కల్పించాలి. సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా, పారదర్శకమైన ఇసుక పాలసీని తీసుకురావాలి. మండలంలోని అవసరాలకు రూ.1000 ధరకే ఇసుకను అందించాలి. ఎల్ఎండి కాలనీ సమీపంలో ఫిష్ మార్కెట్, చేపల నిల్వ కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి. ఎల్ఎండి కాలనీ పరిధిలోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు కేటాయించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించాలి. దశాబ్దాలుగా ఆగిపోయిన పవర్ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. లేనిపక్షంలో భూములను రైతులకు తిరిగి అప్పగించాలి. మండల ప్రజల మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి. ప్రమాదాలను నివారించేందుకు




కరీంనగర్ హైదరాబాద్ రాజీవ్ రహదారిలో అలుగునూర్ నుండి గుండ్లపల్లి వరకు స్పీడ్ లిమిట్, స్టాపర్లు, మరియు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలి. "గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది" అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామాల్లో నాణ్యమైన రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కేంద్ర నిధులు పుష్కలంగా అందుతున్నాయి. గ్రామాల్లో ఈజీఎస్ పథకం కింద మంజూరైన భారీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు నాయకులకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగడుతూ, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ తిమ్మాపూర్ మండల శాఖ కార్యాచరణ ఉండబోతుందని మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మాజీ మండలాధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి , జిల్లా ఈసీ మెంబర్ సంపత్, మండల ప్రధాన కార్యదర్శి



జి.తిరుపతిరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ సౌజన్య కిషోర్, బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్ , ఎలుకపల్లి స్వామి, పటాకుల చోక్కయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్, జాడి రాజు, బోనాల మోహన్, ఓదెలు, కిన్నెర అనిల్, చింతం లక్ష్మణ్ ,ప్రదీప్ రెడ్డి, కన్నంసాయి కృష్ణ, అజయ్, ప్రేమ్ చంద్, రాఘవరెడ్డి, రామిడిమహేందర్ రెడ్డి, శ్రీను, సుగుణాకర్, ఓంకార్ , వెంకటేష్ , రాజు జక్కోజు అనిల్, సంపత్ , రాజు లతోపాటు బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు. **బిజెపి నాయకుడు దరిపెల్లి సతీష్ కుటుంబాన్ని పరామర్శించిన తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు.** బిజెపి నాయకుడు దరిపెల్లి సతీష్ కుమారుడు అజయ్ ఇటీవల మృత్యువాత చెందిన నేపథ్యంలో తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు బుధవారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇను గొండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ రావుల శంకర్ గౌడ్ బూత్ అధ్యక్షులు కామర వెంకటేష్ కందుకూరి ఈశ్వర చారి సుద గోని శ్రీనివాస్ కామెర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు..

## జానపాటి శారద మృతికి సండ్ర సంతాపం



**కల్లూరు, జులై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో రఘునాథ బంజర గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల నాయకులు జానపాటి రామారావు సతీమణి శారద బుధవారం ఆకస్మికంగా మృతి చెందటంతో రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సంతాపం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా జానపాటి రామారావును ఫోనులో పరామర్శించి ఓదార్చారు. గ్రామంలో ఆశ వర్కర్ గా పనిచేస్తున్న శారద మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతి పట్ల గ్రామం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## 'ఎక్మో'తో ఊపిరితిత్తుల చికిత్స 'యశోద'లో సరికొత్త విప్లవం!

**- చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అందుబాటులో అత్యంత అధునాతన వైద్యం**
**- యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ వైద్యులు డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ**

**ఖమ్మం ప్రతినిధి, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** శ్వాస ఆడక, ఊపిరితిత్తులు పూర్తిగా క్షీణించి, జీవితంపై ఆశలు వదిలేసుకున్న రోగుల గుండెల్లో సరికొత్త వెలుగులు నింపుతోంది ఆధునిక వైద్యశాస్త్రం. చివరి దశకు చేరిన ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు 'ఎక్మో' చికిత్సా విధానం ఒక దైవిక వరంగా మారిందని, ఊపిరితిత్తుల చికిత్స 'యశోద'లో సరికొత్త విప్లవం అని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్ప్లాంట్ పల్మనాలజిస్ట్ వైద్యులు డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ పేర్కొన్నారు. ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో రోగులకు, వారి కుటుంబాలకు ధైర్యాన్నిచ్చే ఎన్నో హృదయపూర్వక విషయాలను డాక్టర్ తపస్వి పంచుకున్నారు. ఈ సందర్భంగాడాక్టర్ తపస్వి మాట్లాడుతూ... 'ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన బతుకుపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎక్మో వంటి సాంకేతికత, అంతర్జాతీయ




స్థాయి వైద్య సదుపాయాలు ఇప్పుడు మన తెలుగు రాష్ట్రాల్లోనే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇది కేవలం వైద్యం కాదు, రోగులకు అందించే పునర్జన్మ" అని డాక్టర్ తపస్వి ఆశాభావం వ్యక్తం చేశారు. **జీవన శ్వాసను నిలిపే అద్భుత యంత్రం** తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నప్పుడు, అవి రక్తానికి ఆక్సిజన్ను అందించే శక్తిని కోల్పోతాయి. అలాంటి క్లిష్ట సమయంలో 'వెనో - వీనస్ ఎక్మో' విధానం ప్రాణదాతగా నిలుస్తుందన్నారు. ఇది శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది. ొరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహిస్తుంది. దానికి పూర్తి ఆక్సిజన్ను అందించి, కార్బన్ డయాక్సైడ్ను తొలగిస్తుంది. తిరిగి ఆ శుద్ధి చేసిన రక్తాన్ని సురక్షితంగా శరీరంలోకి పంపుతుంది. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు, సరైన దాత దొరికేవరకు వారి ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతికత అత్యంత కీలకమైన ఆసరాగా మారుతుంది. ఎక్మో సాయంతో ఉన్న రోగులకు అవయవ మార్పిడి చేయడం అనేది వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన, సుదీర్ఘమైన ప్రక్రియ. రక్తం గడ్డకట్టడం, అధిక రక్తస్రావం వంటి ప్రాణాంతక ప్రమాదాలను అధిగమిస్తూ... గుండె, ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ నర్సింగ్ బృందం క్షణక్షణం ఎంతో సమన్వయంతో, ఆప్యాయతతో వ్యవహరించి ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేస్తారు. శస్త్రచికిత్స కేవలం ఆపరేషన్ థియేటర్కే పరిమితం కాదు. ఆ తర్వాత అందించే అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం, వెంటిలేటర్ల నుండి సురక్షితంగా బయటకు తీసుకువస్తారు. ప్రత్యేక శారీరక వ్యాయామాల (రిహాబిలిటేషన్) ప్రక్రియ ద్వారా రోగులు తమ కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకుంటూ, మళ్లీ తమ పాత ఉత్సాహభరితమైన సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్స తోడ్పడుతుంది. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్ పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా 22వ డివిజన్‌లో ఉచిత మొక్కల పంపిణీ

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ టౌన్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):**వనమహోత్సవం సందర్భంగా కరీంనగర్ నగరంలోని 22వ డివిజన్ హిందూపురి కాలనీ సమీపంలో స్థానిక కార్పొరేటర్ బండ రమణ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన డివిజన్ ప్రజలకు ఉచిత మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూపురి కాలనీ కమిటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కరీంనగర్ నగరంలో రూ.1.5 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**47వ, 62వ డివిజన్లలో అభివృద్ధి పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి భూమిపూజ**


**కరీంనగర్ టౌన్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 47వ, 62వ డివిజన్లలో UIDF నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ముందుగా 47వ డివిజన్ రామ్‌నగర్‌లోని సిద్ధార్థ స్కూల్ సమీపంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామిఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం 62వ డివిజన్‌లో శ్రీరామ బుక్ స్టాల్‌ఆకుల శైలజ హాస్పిటల్ సమీపంలో UIDF నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



మాట్లాడుతూ, నగరంలో నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, 47వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ గాజా రమా శివరాం, 62వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, కార్పొరేటర్లు మాసం గణేష్, మేకల వెంకటేష్, లి కెపిపి చంద్ర, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బండారి వేణు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సర్‌ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే...

● మీ ఓటును కాపాడుకోండి... మీ భవిష్యత్తును కాపాడుకోండి ● సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు... ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం ● ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం ● ఓటే లేకపోతే... మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది? ● ఆ ఏముందిలే అని నిర్లక్ష్యం చేస్తే ఓటును కోల్పోతారు ● యువకులారా...సర్ ప్రక్రియలో పాల్గొనండి ● మీ కుటుంబ సభ్యుల ఓట్లు పోకుండా చూడండి ● సర్ పేరుతో కొన్నిచోట్ల రాష్ట్రంలో హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది ● హిందువులంతా జాగృతమై సర్ ప్రక్రియలో పాల్గొనాలి ● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు ● కరీంనగర్‌లో ఎన్యుమరేషన్ దరఖాస్తును నింపిన బండి సంజయ్‌బీఎల్ఓ వద్దకు వెళ్లి ఫారమ్ ను అందజేసిన కేంద్ర మంత్రి ● సర్ ప్రకియ పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్





**కరీంనగర్ జిల్లా 15(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రజలంతా తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(సర్) ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజప్తి చేశారు. "సర్ ను లైట్ తీసుకుంటే... మీ ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉంది"అని హెచ్చరించారు. సర్ ప్రక్రియను ఎవరూ లైట్ తీసుకోవద్దని కోరారు. 'మీ ఓటును కాపాడుకోండి... మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి" అని పిలుపునిచ్చారు. ఈరోజు కరీంనగర్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ "సర్" ఫాంను నింపి చైతన్యపురిలోని సాధన స్కూల్ లో ఉన్న బీఎల్ వో అధికారుల వద్దకు వెళ్లి సమర్పించారు. అక్కడే ఆన్ లైన్లోనూ ఆ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది? ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందరికీ పంపిణీ చేశారా? ఎంత మంది ఎన్యుమరేషన్ దరఖాస్తులను నింపి అందజేశారు? ఈ విషయంలో ఓటర్లు పడుతున్న ఇబ్బందులేమిటి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 24లోపు ఎన్యుమరేషన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం మంది ఓటర్లు మాత్రమే ఎన్యుమరేషన్ ఫాంలను అందజేశారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలంతా సర్ ప్రక్రియలో పాల్గొనాలి. ఈనెల 24 వరకు సమయం ఉందని నిర్లక్ష్యం చేయకండి! చివరి రోజు కోసం ఎదురుచూడకండి. ఈ రోజే ఎన్యుమరేషన్ ఫారమ్ నింపండి... మీ ఓటును కాపాడుకోండి. అట్లాగాకుండా 'నా దగ్గర ఓటర్ ఐడీ ఉంది... నాకు ఏమవుతుందిలే" అని ఇంట్లో కూర్చుంటే... రేపు ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌కు వెళ్లిన తర్వాత "లిస్టులో మీ పేరు గల్లంతవుతుంది. అందుకే చేతిలో ఓటర్ ఐడీ ఉంటే సరిపోదు... ఓటరు జాబితాలో పేరు ఉండాలి. అందులో భాగంగా బీఎల్ఓ మీ ఇంటికి వస్తే సహకరించండి. సర్ ఫారమ్ తీసుకోండి. వివరాలు సరిచూసుకోండి. ఫారమ్ నింపి గడువులోగా అందించండి. ముఖ్యంగా తెలంగాణ యువతను కోరుతున్నా... మీ ఫోన్‌లో గంటల తరబడి సోషల్ మీడియా చూస్తారు. రాజకీయాలపై పోస్టులు పెడతారు. ప్రభుత్వాలను తిడతారు. నాయకులను ప్రశ్నిస్తారు. కానీ మీ ఓటు లిస్టులో ఉందో లేదో ఒక్కసారైనా చూసుకున్నారా? ఓటే లేకపోతే... మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది? మీ ఇంట్లో అమ్మ ఓటు చూడండి. నాన్న ఓటు చూడండి. కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయో లేదో చూడండి. ఎందుకంటే ఓటు అంటే కాగితం ముక్క కాదు. ఓటు అంటే ప్రజల చేతిలో ఉన్న అధికారం. ఓటు అంటే ప్రశ్నించే హక్కుకు బలం. ఐదేళ్లు నాయకులు ప్రజల దగ్గరకు రాకపోయినా, ఎన్నికల రోజు మాత్రం ప్రజల దగ్గరకు రావాల్సిందే. ఎందుకు? మీ చేతిలో ఓటు ఉంది కాబట్టి. అలాంటి ఓటును నిర్లక్ష్యంతో పోగొట్టుకుంటారా? ఆలోచించాలని కోరుతున్నా. ఎవరో చూస్తారులే... దీూా చూసుకుంటారులే... పార్టీ వాళ్లు చూసుకుంటారులే... అని వదిలేయొద్దు! మీ ఓటు బాధ్యత మీదే! ముఖ్యంగా ప్రతి యువకుడు "నా కుటుంబంలో ఒక్క ఓటు కూడా పోనివ్వను" అని సంకల్పంతో చేయాలి!సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు... ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం. ఈ రోజు సర్ ఫారమ్‌ను నిర్లక్ష్యం చేస్తే రేపు పోలింగ్ బూత్ దగ్గర పశ్చాత్తాపపడే పరిస్థితి రావచ్చు! మీ ఓటును కాపాడుకోండి... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి. ముఖ్యంగా కొన్ని చోట్ల సర్ పేరుతో హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది. మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీ హిందువుల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తోంది. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదముంది. తెలంగాణలోని హిందువులంతా జాగ్రుతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉంది. ఈ రోజు ఎన్యుమరేషన్ ఫారమ్ నింపడానికి పది నిమిషాలు కేటాయించక పోతే... రేపు ఎన్నికల రోజు "నా ఓటు ఎక్కడ?" అని బాధపడాల్సి వస్తుంది. అప్పుడు అధికారులను నిందించినా, వ్యవస్థను ప్రశ్నించినా కాలం వెనక్కి రాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీ ఓటు పోతే... మీ గొంతు బలహీనపడుతుంది. మీ ఓటు ఉంటే... మీ ప్రశ్నకు బలం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నాయకుడి కంటే గొప్పవాడు ఓటర్. ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్. రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్మించేది ఓటర్. అలాంటి అమూల్యమైన ఓటు హక్కును నిర్లక్ష్యంతో కోల్పోవద్దు.

# హైదరాబాద్‌లో మజ్లిస్ అరాచకం

● ఆటోపై హిందుత్వ నినాదం రాసుకున్నందుకు దౌర్జన్యం ● ఆటో టాప్ చింపేసి బూతులు తిట్టిన మజ్లిస్ గూండాలు ● అత్తాపూర్ పోలీసులు సైతం మజ్లిస్ నాయకులకు వత్తాసు ● హిందుత్వ నినాదం తొలగించకపోతే హైదరాబాద్ లో ఆటో నడపనీయబోమన్న ఎస్ఐ ● కేసు పెట్టి బొక్కలో వేస్తామంటూ దబాయింపు ● హిందుత్వ వాదులను కలిసి వాపోయిన భరత్ ● భరత్‌ను తీసుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన హిందుత్వ వాదులు ● అండగా ఉంటామని కేంద్ర మంత్రి హామీ ● డ్యామేజ్ అయిన ఆటో స్థానంలో కొత్త ఆటో కొనిస్తానని భరోసా



కరీంనగర్ టౌన్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): ఆటోపై హిందుత్వ నినాదాన్ని రాసుకోవడమే అతను చేసిన పాపం. బండ బూతులు తిడుతూ ఆటో కవర్ ను చించేయడమే కాకుండా పోలీసు అండతో భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన హైదరాబాద్ లోని మెహిదీపట్నంలో ఆలస్యంగా వెలుగు చేసింది. వివరాల్లోకి వెళితే... వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్ కుమార్(24) పొట్టకూటి కోసం హైదరాబాద్ కు వచ్చి ఆటో నడుపుతున్నాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. నెలలో 15 రోజులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. హైదరాబాద్ లో ఇల్లు లేకపోవడంతో ఆటో నడిపినన్ని రోజులు హైదరాబాద్ లోనే ఎక్కడో ఒక దగ్గర ఫుట్ పాత్ పైన, బస్టాండ్ వద్ద పడుకోవడం, తెల్లవారుజామున సులభ్ కాంప్లెక్స్ కు వెళ్లి స్నానపానాదులు పూర్తి చేసుకుని మళ్లీ ఆటోనడపడం, ఆ వచ్చిన డబ్బుతో ఊరికి వెళ్లి కుటుంబంతో జీవనం కొనసాగించడం భరత్ కు నిత్యక్రుత్యమైంది. భరత్ హిందుత్వ వాది. అందుకే ఆటో వెనుక (నీ మతాన్ని మార్చుకోవడం అంటే నీ తండ్రిని మార్చుకోవడం లాంటిది), (ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ హిందువులేడ జై శ్రీరామ్) అని నినాదాన్ని రాయించుకున్నారు. అయితే ఈనెల 13న భరత్ ప్యాసింజర్ ను ఎక్కించుకుని మెహిదీపట్నం నుండి జీడిమెట్లకు వెళుతుండగా మజ్లిస్ పార్టీకి చెందిన నలుగురు యువకులు ఆటోను వెంబడించారు. పిల్లర్ నెంబర్ 131 వద్ద అడ్డగించారు. బలవంతంగా భరత్ ను ఆటో నుండి దింపి.. 'ఆటో వెనుక ఏం రాసినవ్ రా... ఏమనుకుంటున్నవ్ రా...ఆ స్లోగన్స్ తీసేస్తావా? లేదా?" అంటూ బండ బూతులు తిట్టడం ఆరంభించారు. నా ఆటో, నా ఇష్టం. నేను రాసిన దాంట్లో తప్పేముంది? అని అడిగితే... రాయలేని భాషలో పచ్చి బూతులు తిడుతూ ఆటో కవర్ వెనుకనున్న నినాదాలను గీకేశారు. ఆటో కవర్ ను చించి వేశారు. మళ్లీ అట్లాంటి నినాదాలు రాస్తే... హైదరాబాద్ లో ఆటో కూడా తిరగనీయబోమని, చంపేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. మళ్లీ కాసేపటికే అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ వచ్చింది. "నేను అత్తాపూర్ ఎస్ఐని(పేరు శ్రీనివాసులు) మాట్లాడుతున్నా. ఆటోమీద అట్లాంటి స్లోగన్స్ ఎట్లా రాస్తావ్? హైదరాబాద్ లో ఆటో తిరగాలని ఉందా? లేదా? వెంటనే స్టేషన్ కు రా. నీమీద కంప్లయింట్ వచ్చింది. రాకపోతే నీ ఆటోను సీజ్ చేస్తా"అంటూ బెదిరించారు. దీంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో పడిపోయిన భరత్ కు అక్కడున్న కొందరు హిందుత్వ వాదుల వద్దకు తీసుకెళ్లారు. విషయం విన్న వాళ్లు భరత్ కు అండగా నిలిచారు. అత్తాపూర్ పీఎస్ కు తీసుకెళ్లి స్థానిక సీఐకి జరిగిందంతా వివరించారు. ఎస్ఐ శ్రీనివాసులుపై చర్య తీసుకోవడంతోపాటు భరత్ ను బెదరించి ఆటో ను డ్యామేజ్ చేసిన మజ్లిస్ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదు ఇచ్చారు. అట్లాగే భరత్ ను వెంట బెట్టుకుని ఈరోజు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి వచ్చి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిశారు. జరిగిన విషయాన్ని వివరిస్తూ ఫోటోలు, వీడియోలు చూపించారు. భరత్ ద్వారా తెలుసుకున్న కేంద్ర మంత్రి "బాధపడొద్దు. నేను అండగా ఉంటా"అని భరోసా ఇచ్చారు. హిందుత్వ సిద్ధాంతాన్ని నమ్మి ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నందుకు అభినందించారు. ఆటో కవర్ డ్యామేజ్ అయిందని భరత్ చెప్పడంతో పాత ఆటో స్థానంలో కొత్త ఆటో తీసుకోవాలని, అందుకయ్యే ఖర్చును తాను చెల్లిస్తానని హామీ ఇవ్వడంతోపాటు వెంటనే కొత్త ఆటో కొనిచ్చి అందుకయ్యే డబ్బు ఇవ్వాలని అక్కడే ఉన్న సిబ్బందిని ఆదేశించారు. భరత్ ను వేధించిన మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకునే అంశంపై హైదరాబాద్ సీపీతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

# ఈనెల 18, 19న గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు

● రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి



**ఖమ్మం ప్రతినిధి, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈనెల 18, 19 తారీఖున పాల్వంచలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పిలుపునిచ్చారు. బుధవారం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్లో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మహాసభలకు అఖిల భారత ఆదివాసీ మహాసభ ఇంచార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి డి. అనీరాజా, జాతీయ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత ఆదివాసీ మహాసభ పసుపతి కోల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలకు ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలలో గిరిజనుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు వారు తెలిపారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, అధ్యక్షులు బానోత్ రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా నర్సింహా, పాల్తియా శ్రీను, గుగులోత్ శ్రీను, బానోత్ రామ్మూర్తి, భూక్యా శ్రీకాంత్, గుగులోత్ లచ్చిరాం, బోడా చిన్న పాల్గొన్నారు.

# షాద్‌నగర్ అభివృద్ధే నా ధ్యేయం..

● షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం ● 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ ఆధ్వర్యంలో. ● రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





**షాద్ నగర్, జూలై 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** షాద్ నగర్ పట్టణంలోని ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డులో రూ. 10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫరూక్‌నగర్ అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే షాద్‌నగర్ పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్ఓలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## సీనియర్ల రాకతో బలంగా టీమిండియా జట్టు

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో చిత్తు చిత్తుగా ఓడిన భారత జట్టు.. తొలి వన్డేలో మాత్రం ఘనవిజయాన్ని అందుకుంది. సీనియర్లు రావడంతో జట్టు బలంగా తయారైంది. మొదట బౌలర్లు ప్రతాపం చూపిస్తే.. ఆ తర్వాత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఫలితంగా భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు విఫలం అయ్యారు. కోహ్లీ కేవలం 5 పరుగులు చేసి అవుటైతే.. రోహిత్ శర్మ 11 పరుగులు మాత్రమే చేశాడు. అయితే గిల్ (80 రిటైర్డ్ హర్ట్) జట్టుకు విజయాన్ని ఖాయం చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవడానికి ముఖ్య కారణం బౌలర్లు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో మంచి ప్రదర్శన చేసింది. ముఖ్యంగా బెన్ డకెట్ (43) అద్భుతంగా ఆడాడు. తొలి వికెట్‌కు బెతెల్ (14)తో కలిసి 61 పరుగులు జోడించారు. ఈ దశలో ఇంగ్లండ్ 300కు పైగా పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బౌలర్ గుర్నార్ బ్రార్ టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. బంతిని అందుకున్న అతడు 3 బంతుల వ్యవధిలో 2 వికెట్లు తీశాడు. 13వ ఓవర్ వేసిన బ్రార్.. మొదట జాకబ్ బెతెల్‌ను అవుట్ చేశాడు. అనంతరం డేంజరస్ ప్లేయర్ బెన్ డకెట్‌ను అవుట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 2 పరుగుల తేడాతో రెండు వికెట్లను కోల్పోయింది. ఇక ఇక్కడి నుంచి భారత జట్టు పుంజుకుంది. ఆ వెంటనే మరో డేంజరస్ ప్లేయర్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా అవుట్ చేశాడు. అంతే ఇంగ్లండ్ వెంటవెంటనే 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికట్లను కోల్పోయింది. ఒక దశలో 61 పరుగులకు వికెట్ లేకుండా ఉన్న ఇంగ్లండ్.. 46 పరుగుల తేడాతో 6 వికెట్లను కోల్పోయింది. గుర్నూర్ బ్రార్ 9 ఓవర్లలో 2 వికెట్లు తీశాడు. అయితే మ్యాచ్ మధ్యలో కాస్త అతి కూడా చేశాడు. బెన్ డకెట్ నేరుగా కొట్టిన షాట్‌ను అడ్డుకున్న బ్రార్.. బంతిని డకెట్ వైపు విసిరాడు. ఆ తర్వాత బంతిని డకెట్ సిక్సర్ బాదాడు. సోషల్ మీడియాలో.. ఇలాంటి అతి పనులు చేయకు బ్రార్.. నీలో గొప్ప ట్యాలెంట్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# కోహ్లితో కలిసి వరల్డ్‌కప్ 2027 ప్లాన్..

### కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు

భారత వన్డే జట్టు భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలతో తెరదించారు. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళికలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అందులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కోహ్లీ భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలకు కొత్త కోణం లభించింది. ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో గిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ 2027లో జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగుతారా లేదా అన్న ప్రశ్నలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గిల్ స్పందిస్తూ, తాను రెండు రోజుల క్రితమే విరాట్ కోహ్లీతో కలిసి 2027 ప్రపంచకప్‌కు సంబంధించిన ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. “మేము జట్టు కాంబినేషన్ గురించి మాట్లాడుకున్నాం. ప్రపంచకప్ జట్టులో ఎవరెవరు ఉండొచ్చు, ప్రస్తుతం జట్టులో లేకపోయినా భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే ఆటగాళ్లు ఎవరు, ఏ ఆటగాడిని ఏ స్థానంలో ఆడించడం జట్టుకు ఉపయోగపడుతుంది వంటి అనేక అంశాలపై చర్చించాం” అని గిల్ తెలిపారు. ఈ వ్యాఖ్యలు చూస్తే కోహ్లీని కేవలం సీనియర్ ఆటగాడిగానే కాకుండా, జట్టు వ్యూహాల రూపకల్పనలో భాగస్వామిగా కూడా భారత జట్టు యాజమాన్యం పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొద్ది రోజుల క్రితం విరాట్ కోహ్లీ మాట్లాడుతూ, తాను తన స్థానాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉన్న జట్టులో కొనసాగాలని అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. అలాంటి సమయంలో గిల్ చేసిన తాజా వ్యాఖ్యలు కోహ్లీపై జట్టు యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని




మరోసారి తెలియజేశాయి. తన నాయకత్వంలో కూడా కోహ్లీ కీలక పాత్ర పోషిస్తారని గిల్ స్పష్టం చేసినట్లుగా ఈ వ్యాఖ్యలను విశ్లేషకులు భావిస్తున్నారు. కెప్టెన్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత టెస్టులు, టీ20ల్లో కోహ్లీ ప్రత్యక్షంగా నాయకత్వ వ్యవహారాల్లో పెద్దగా పాల్గొనలేదు. అయితే ఇప్పుడు 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయనతో కలిసి వ్యూహాలపై చర్చించడం కొత్త పరిణామంగా భావిస్తున్నారు. ఇది జట్టు నిర్మాణంలో కోహ్లీ అనుభవానికి ఇప్పటికీ ఎంత ప్రాధాన్యం ఉందో తెలియజేస్తోందని క్రికెట్ నిపుణులు అంటున్నారు. వన్డే క్రికెట్‌లో కెప్టెన్‌గా కూడా కోహ్లీ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆయన భారత జట్టుకు మొత్తం 95 వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించి 65 విజయాలు అందించారు. 68.42 శాతం విజయశాతంతో ఒకటి కంటే ఎక్కువ వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారత కెప్టెన్లలో అత్యుత్తమ విజయశాతాన్ని నమోదు చేశారు. ఈ గణాంకాలు కూడా ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వయస్సు గురించి వస్తున్న ప్రశ్నలపైనా గిల్ స్పందించారు. గత పదేళ్లుగా భారత బ్యాటింగ్‌కు ఈ ఇద్దరూ వెన్నెముకగా నిలిచారని కొనియాడారు. వివిధ దేశాల్లో, భిన్నమైన పరిస్థితుల్లో ఎన్నో మ్యాచ్‌లు గెలిపించిన అనుభవం వారికి ఉందని చెప్పారు. వారి అనుభవం, నైపుణ్యం జట్టుకు ఇప్పటికీ ఎంతో విలువైనవని స్పష్టం చేశారు. భారత వన్డే జట్టు భవిష్యత్తు నిర్మాణంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పిస్తూనే, అనుభవజ్ఞులైన కోహ్లీ, రోహిత్‌ల మార్గదర్శకత్వాన్ని కూడా వినియోగించుకోవాలనే ఆలోచనలో జట్టు యాజమాన్యం ఉన్నట్లు గిల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా భారత జట్టు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా అడుగులు వేస్తుండగా, కోహ్లీ, రోహిత్ ఇద్దరూ ఆ ప్రణాళికల్లో కీలక భాగస్వాములుగానే కొనసాగుతున్నారని గిల్ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

# ఫైనల్‌కు దూసుకెళ్లిన స్పెయిన్

టెక్సాస్‌లోని అర్లింగ్టన్‌లో మంగళవారం జరిగిన ఈ కీలక పోరులో స్పెయిన్ తన వ్యూహాత్మక ఆటతీరుతో ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాళ్లను పూర్తిగా కట్టడి చేసింది. ఈ విజయంతో మూడోసారి ప్రపంచకప్ గెలవాలనే ఫ్రాన్స్ కలలను స్పెయిన్ చెదరగొట్టింది. ఈ టోర్నమెంట్‌లో వరుస విజయాలతో ఫ్రాన్స్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ, స్పెయిన్ ఆటగాళ్ల జోరు ముందు నిలవలేకపోయింది. మ్యాచ్ మొదటి సగభాగంలో ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే, స్పెయిన్ వింగర్ లామిన్ యమల్‌ను ఫౌల్ చేయడంతో రిఫరీ స్పెయిన్‌కు పెనాల్టీ ఇచ్చారు. దీనిని మైకెల్ ఓయర్జబల్ గోల్‌గా మలిచి స్పెయిన్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నమెంట్‌లో ఫ్రాన్స్ జట్టు ప్రత్యర్థికి ఆధిక్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. ఆ తర్వాత కొద్దిసేపటికే ఫ్రాన్స్ కీలక డిఫెండర్ విలియం సలిబా వెన్నునొప్పి కారణంగా మైదానాన్ని వీడడం ఆ జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ద్వితీయార్ధంలో ఫ్రాన్స్ కోచ్ డిడియర్ డెషాంప్స్ తమ అటాకింగ్‌ను బలోపేతం చేసేందుకు మార్పులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మ్యాచ్ 58వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పెడ్రో పోరో, డాని ఓల్మో అందించిన పాస్‌ను అద్భుతమైన గోల్‌గా మలిచి జట్టు ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. కిలియన్ ఎంబాపె, ఉస్మాన్ డెంబెలే వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఫ్రాన్స్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ టోర్నమెంట్‌లో స్పెయిన్ డిఫెన్స్ అత్యంత బలంగా ఉంది, వారు మొత్తం టోర్నీలో కేవలం ఒకే ఒక్క గోల్ సమర్పించుకున్నారు. ఇప్పుడు స్పెయిన్ జట్టు ఆదివారం జరగబోయే ఫైనల్‌లో ఇంగ్లాండ్ లేదా అర్జెంటీనాతో తలపడనుంది. మరోవైపు, గత రెండు ప్రపంచకప్‌లలో ఫైనల్‌కు చేరిన ఫ్రాన్స్ జట్టుకు ఈ ఓటమి పెద్ద షాక్ ఇచ్చింది. ఈ టోర్నమెంట్ తర్వాత ఫ్రాన్స్ కోచ్‌గా 14 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించి తప్పుకోనున్న డిడియర్ డెషాంప్స్‌కు నిరాశే మిగిలింది. ఓడిపోయిన ఫ్రాన్స్ జట్టు శనివారం జరిగే మూడో స్థానం కోసం ప్లే-ఆఫ్ మ్యాచ్ ఆడనుంది. ఈ విజయంపై స్పెయిన్ గోల్ స్కోరర్ పెడ్రో పోరో స్పందిస్తూ, ఇది ఒక “కల నిజమవ్వడం” లాంటిదని, జట్టు సమిష్టికృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశాడు.




# 2027 వన్డే ప్రపంచకప్‌లో సరికొత్త ఫార్మాట్

### • కీలక మార్పులు చేసిన ఐసీసీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టోర్నమెంట్ల విధానాలలో కీలక మార్పులు తీసుకొచ్చింది. టోర్నీల్లో పోటీ స్థాయిని పెంచడం, ప్రతి మ్యాచ్‌కు మరింత ప్రాధాన్యం కల్పించడం, అభిమానులకు మరింత ఆసక్తికర అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా కొత్త విధానాలను ప్రవేశపెట్టింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ సిఫార్సుల మేరకు ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ బోర్డు వార్షిక సమావేశాలలో ఈ నిర్ణయాలు తీసుకుంది. 2027 వన్డే ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు బరిలోకి దిగనున్నాయి. 2019, 2023 ప్రపంచకప్‌ల్లో 10 జట్లు మాత్రమే పాల్గొనగా, 2015 తర్వాత మళ్లీ 14 జట్లతో టోర్నీ నిర్వహించనున్నారు. అయితే నాకౌట్ రౌండ్లకు ముందు ఇది మూడు దశల్లో మ్యాచులు నిర్వహిస్తారు. ఈ ఫార్మాట్ ప్రకారం తొలుత అర్హత సాధించిన జట్లలో అత్యల్ప ర్యాంకింగ్ కలిగిన మూడు జట్లు (12, 13, 14వ స్థానాల్లో ఉన్నవి) మొదట 'సూపర్ సిరీస్' (రౌండ్-రాబిన్)లో పాల్గొంటాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన జట్టు తదుపరి దశలో మిగిలిన 11 జట్లతో కలుస్తుంది. అప్పటి నుంచి



అసలైన టోర్నీ ప్రారంభం అవుతుంది. రెండో దశలో ఆరు జట్ల చొప్పున రెండు గ్రూపులు ఉంటాయి. ప్రతి గ్రూప్ రౌండ్-రాబిన్ పద్ధతిలో పోటీపడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 7 దశకు చేరుకుంటాయి. ఈ ఆరు జట్లు కాకుండా ఈ రెండు గ్రూప్‌లలో కలిపి అత్యుత్తమ ప్రదర్శన చేసిన మరో జట్టు కూడా సూపర్ 7కు చేరుతుంది. 'సూపర్ 7' దశలో ఏడు జట్ల మధ్య సింగిల్ రౌండ్-రాబిన్ పోటీ జరుగుతుంది. 'సూపర్ 7' దశలో మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఇందులో మొదటి స్థానంలో ఉన్న జట్టు నాలుగో స్థానంలో ఉన్న జట్టుతోనూ, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో స్థానంలో ఉన్న జట్టుతోనూ తలపడతాయి. విజేతలు ఫైనల్‌లో పోటీపడతారు. మరిన్ని జట్లకు అతిపెద్ద వేదికపై పోటీపడే అవకాశాలను కల్పిస్తూనే, టోర్నమెంట్ ప్రారంభం నుంచే ప్రతి మ్యాచ్ ప్రాముఖ్యతను పెంచేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు ఐసీసీ తెలిపింది.



## ఆదివారం ముగింపు వేడుక.. ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం..!

ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో ముగింపు వేడుకలపై నిర్వాహకులు దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ జూలై 19 ఆదివారంతో పూర్తి కానున్నందున.. అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియంలో జరుగనున్న 'క్లోజింగ్ సెరెమొనీ'లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్, ఇంటర్నెట్ సెన్సేషన్ 'ఐషోస్పీడీ' సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు.

సాకర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ విజేత ఎవరో ఆదివారంతో తేలిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో, టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూ జెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది.

# 23న నే జననాయగన్ విడుదలకు రెడీ




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

-------

# ప్రభాస్ అంటే ..మాంచి భోజనం గుర్తుకొస్తుంది



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.





# అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రాకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఐకాన్ అని రాసి ఉన్న క్యాప్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఒక్క పోస్టే ప్రస్తుతం టాలీవుడ్, మాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్‌కు అభిమానులు పెట్టిన బిరుదు కావడంతో, ఈ పోస్ట్ ఆయనతో చేయబోయే సినిమాపై పరోక్షంగా ఇచ్చిన హింట్ అని నెటిజన్లు భావిస్తున్నారు. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం చాలా రోజులుగా సాగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం ఇచ్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి'తో సూపర్ హీరో జానర్‌లో తన సత్తా చాటిన బసిల్ జోసెఫ్, 'శక్తిమాన్' కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించ బోతున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలను దర్శకుడు ఇప్పటికే ఖండించారు. బన్నీతో చేయబోయేది పూర్తిగా కొత్త కథేనని స్పష్టం చేశారు. కథ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై పూర్తి స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లే ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యాక దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాతే బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అట్లీ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రం కాగా, లోకేష్ మూవీ 23వ చిత్రంగా రానుంది. బసిల్ జోసెఫ్ ప్రాజెక్ట్‌ను అల్లు అర్జున్ తన 25వ చిత్రంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.



# వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



# చరణ్ కోసం సుకుమార్ మాస్టర్ ప్లాన్..





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్‌సీ17'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రతి చిన్న విషయం కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సంచలన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ నయనతార ఓ అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.సుకుమార్ సినిమాల్లో కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా కథాగమనాన్ని మలుపు తిప్పే సహాయ పాత్రలు కూడా చాలా బలంగా, గుర్తుండిపోయేలా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే 'ఆర్‌సీ17' కోసం నయనతారకు ఒక పవర్‌ఫుల్ పాత్రను ఆయన డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె హీరోయిన్‌గా కాకుండా, కథకు వెన్నెముకగా నిలిచే పాత్రను పోషించనున్నారని సమాచారం. దక్షిణాదిలో అగ్రతారగా వెలుగొందుతున్న నయన్ ఎంట్రీతో ఈ సినిమాకు పాన్-ఇండియా స్థాయిలో మరింత బలం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఆమె నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రామ్ చరణ్ సినిమాలో కూడా ఆమె నటిస్తే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే సుకుమార్ ఈ సినిమా ఫైనల్ నెరేషన్‌ను రామ్ చరణ్‌కు వినిపించగా, ఆయన కథ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దేందుకు సుకుమార్ తన రచయితల బృందంతో కలిసి ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు తెలుస్తోంది. కథలోని భావోద్వేగాలు, పాత్రల మధ్య సంబంధాలను మరింత బలంగా తీర్చిదిద్దే పనిలో ఆయన నిమగ్నమైనట్లు సమాచారం. అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరిగితే, ఈ ఏడాది అక్టోబర్‌లో పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే 'పెద్ది' చిత్రంతో మరో బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్న రామ్ చరణ్, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. మొత్తం మీద 'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ అవుతుండటం, దానికి నయనతార లాంటి స్టార్ యాక్టర్ తోడవుతున్నారనే వార్తలు మెగా అభిమానుల్లో, సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక వివరాల కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.